అమ్మ పుట్టిల్లు

నవ్య -దీపావళి సంచిక, 2006



కథా నిలయం
శ్రీకాకుళం

అమ్మ పుట్టిల్లు

"ఇక ఈ ఊరితో మన పేగుముడి తెగినట్లే –" మామయ్య ఫోనులో ఉద్వేగంగా అన్నాడు, "బహుశా ఇదే అక్కయ్య పెట్టే ఆఖరి సంతకం!"

నాకు ఎలా స్పందించాలో తెలియలేదు.

మామయ్య మాటల ఉద్వేగం నన్నూ ముంచెత్తింది. తెప్పరిల్లి నెమ్మదిగా అడిగాను, "ఎప్పుడు రమ్మంటావు మామయ్యా...?"

"సెలవు లేకుండా చూసుకొని రా. మళ్ళీ రిజిస్ట్రార్ ఆఫీస్ మూసేయగలరు."

"సరే, మామయ్యా... ఆఫీసులో పనులవీ చూసుకొని..."

డెడ్ లైన్ల మధ్య వేళ్ళాడే సాఫ్ట్‌వేర్ మనిషిని నేను. నా సమయం నా చేతుల్లో ఉంటే కదా? అందుకే ఈ సణుగుడు.

"ఎలాగైనా తెముల్చుకోరా చిన్నూ..." మామయ్య గొంతులో జీర.

మామయ్య పిలుపు నా పసితనాన్ని ఒక్కసారిగా తట్టి లేపింది. ధీరగంభీరుడైన మామయ్య కంఠంలోని ఆ తడి నా గుండెను తడిమింది. మరుక్షణంలో మరోటి ఆలోచించకుండా మాట ఇచ్చేశాను.

"తప్పకుండా మామయ్యా - " భరోసా ఇచ్చేశాను, "ఎప్పుడు వచ్చేది రాత్రికి ఫోన్ చేసి చెప్తాగా."

మామయ్య చిన్న పిల్లాడిలా సంబరపడ్డాడు.

కానీ, అమ్మను ఎలా తీసుకెళ్ళడం? ఆలోచించాలి.

ఓ నిట్టూర్పుతో మళ్ళీ లోకంలో పడ్డాను. నా లోకంలోకి.

నా లోకమంతా మూడు చదరాలు. కంప్యూటరు, ఆఫీసు, ఇల్లు. చేతికి మట్టి అంటని ఉద్యోగం. నాకు మట్టి మనుషుల గురించిన ఆలోచనలు ఎలా సాగుతాయి? ఎందుకు సాగవు?

చిన్నప్పుడు తాతయ్యగారి చెట్టు మీద ఆడిన కోతికొమ్మచ్చులు నేను ఎలా మర్చిపోగలను? కొబ్బరి చెట్ల కింద ఉత్తుత్తి కుస్తీలు పట్టడం, పోటీలు పడి కబడ్డీ ఆడడం... తురాయి చెట్టుకు పట్టిన తేనెతుట్టెకు ఓ తులువ పిల్లాడి చేతి రాయి తగలడం... జుమ్మంటూ తేనెటీగలు అందరినీ తరిమి తరిమి కుట్టడం... పిక్కలు పట్టేసేలా ఉరుకులు పరుగులతో ఎగశ్వాస దిగశ్వాసలతో వాగొడ్డున జమ్మిచెట్టు మొదట్లో కూలబడడం-

అమ్మమ్మ వండి వడ్డించిన అప్పచ్చులు - తాతయ్య కట్టించిన ఉయ్యాల - మోటబావిలో ఈతలు - మామయ్య చేతిలో వీపు విమానం మోతలు - అప్రయత్నంగా నా పెదవులపై చిరునవ్వు కదలాడింది.

ఊహ ఎంత అంద మైనది!

ఊహలో ఎంత ఆనందముందీ!

ఎంత అందమైనదీ ఎంత ఆనందమైనదీ అంటే - ఊహించలేనంత!

నా పెదవులపై కదలిన చిరునవ్వు మనసంతా హుషారు నింపేసింది. కొద్దిసేపటిలోనే నాకు తెలియకుండానే జ్ఞాపకాల వెల్లువలో తడిచి ముద్దవుతున్నాను.

"థ్యాంక్ యూ... మామయ్యా ..." ఎక్కడో ఉన్న మామయ్యకు ఓ ముద్దు విసిరేసాను చిన్నపిల్లాడిలా. గాలిలో తేలుతూ మామయ్యను చేరకపోతుందా అని.

*

నేనేమయినా పరాయి దేశంలో ఉన్నానా? పాస్‌పోర్టు వీసాల అడ్డంకు లున్నాయా! తలుచుకుంటే ఎంతసేపు ప్రయాణం? ఇలా వెళ్ళి అలా వచ్చేయవచ్చు.

ఏమో, అయినా మామయ్య గారింటికి వెళ్ళి ఎన్నాళ్ళయిందో! ఎన్నేళ్ళయిందో! బహుశా ఏడో తరగతిలో చేరినప్పటి నుంచే సెలవలకి అమ్మమ్మ గారి ఊరెళ్ళడం మానేశాం.

"వచ్చే ఏడాది ఏడో తరగతి – వేసవికాలం ఊళ్ళమ్మట తిరుగుతూ వృధా చేస్తామా అనుకుంటూ ఓ సమ్మర్ క్యాంప్‌లో ఇరుక్కుపోయాను. నిజానికి, ఆ ఆలోచనలో నన్ను ఇరికించేశారు. నాన్న, "చెట్లమ్మట, పుట్లమ్మట తిరుగుతూ ఎందుకూ పనికి రాకుండా పోతాడు... సుమతీ, నా మాట విను. వాడి భవిష్యత్తు ముఖ్యం."

అమ్మకు బాగా తెలుసు, నాన్న ఎంత అనునయంగా చెప్పినా అదే ఆజ్ఞ అనీ. అమలు చేయవలసిందేననీ!

ఇక, అటు నుంచి రాకపోకలే కానీ ఇటు నుంచి ప్రయాణాలు తగ్గిపోయాయి. అమ్మ మనసులో ఏముందో తెలియదు. ఎప్పుడూ ఆ దిశగా

ఆలోచించనే లేదు. ఆమె ఎప్పుడూ నా సమయాన్ని నాన్న ఇచ్చిన కొలబద్దతో కొలుస్తూ – నాకొక ప్రణాళికా బద్దురాలైన సెక్రటరీగా – వ్యవహరించసాగింది. నాన్న నా ప్రతిభను ఓ పక్క, నా భవిష్యత్తును మరో పక్క తూకం వేస్తూ ఉండేవాడు.

అప్పుడప్పుడూ మామయ్య వచ్చి వెళ్ళేవాడు. అమ్మ పుట్టింటి కబుర్లు అటూ ఇటూ మోస్తూ. వెన్నుంద్రాళ్ళు, గోరు చిక్కుళ్ళు, చిట్టి చేమంతులు, గోరింటాకులతో సహా.

తాతయ్య కాలం చేసినప్పుడు నా పదో తరగతి పరీక్షలు. అమ్మమ్మ కదిలి పోయినప్పుడు నా ఎంసెట్. పాపం… అమ్మకు పట్టుమని పది రోజులు పుట్టింట్లో ఉండే అవకాశమే రాలేదు. ఆపై, తనదీ చెల్లివీ విదేశాల చదువులు. ఉద్యోగాలు. వివాహాలు.

ఇంతలో, చెల్లి పురుళ్ళు పుణ్యాలు. అమ్మ ప్రవాస జీవితం. నాన్న ఒంటరి జీవనం.

ఇదుగో… మనలేని మనుగడపై విసిగెత్తి, మళ్ళీ స్వదేశానికి తిరిగి వచ్చాక –అప్పుడు ఉద్వేగంతో అనుకున్నా, "ఏరి తల్లీ మన చుట్టాలు పక్కాలు" అని!

హైదరాబాద్‌లో ఉన్నామన్న మాటే కానీ, పని ఊబిలో కూరుకు పోయి ఉన్నాం నేనూ విశాలి.

ఇప్పుడు నాన్న లేరు. అమ్మకు తీరిక లేదు.

అటు చెల్లెలి పిల్లలకు, ఇటు మా పిల్లలకు ఆమే పెద్ద దిక్కు.

అటు మెంఫిస్‌కూ, ఇటు హైదరాబాద్ మధ్య తిరుగాడుతూ ఉంది.

ఈ వెసులు లేని బతుకుల్లో ఇంకా స్థిరత్వం వచ్చినట్లే లేదు.

అనుకోవడమే కానీ అయిన వారింట వెళ్ళి గడిపే తీరిక ఇంకా దొరకలేదు. మామయ్యే వచ్చి ఓ మారు పలకరించి వెళ్ళాడు. ఆ మాటకు వస్తే, మామయ్య పిల్లలిద్దరూ ఉండేది అమెరికాలోనే. మేమందరం నిత్యం పలకరించుకుంటూనే ఉంటాం. మెయిల్ గ్రూప్‌లో. ఎటొచ్చి మేమందరం కలిసి... తనివితీరా గడిపి చాన్నాళ్ళయింది.

ఆ కాలువ గట్లు, కుస్తీ పట్లు, సీమచింతకాయలు, సీతాకోకచిలుకలు – హు!

"అమ్మను అక్కడ ఓ పదిరోజులు ఉండమని అందామా?" విశాలితో అన్నాను.

"ఓ మై గుడ్‌నెస్! నా డెడ్‌లైన్స్? ఓ సెమినార్ ఆర్గనైజ్ చేయాల్సి వుంది. నేను పేపర్ ప్రజంట్ చేయాలి. గ్రూప్ లీడర్‌ని కదా. ఇప్పుడు... నేను సెలవు పెట్టాలంటే..." విశాలి గొణిగింది, "చింటూ సిరీస్, మింటూ గాడి రివ్యూ. పై నుంచి వాళ్ళిద్దరివీ కల్చరల్స్ ఏవో ఉన్నాయట."

అవును.

విశాలి చెప్పిందీ నిజమే.

ఒక్క క్షణం అటూ ఇటూ తప్పినా – తమ జీవనం తల్లకిందులై పోతుంది.

పెద్దలదీ. పిల్లలదీ.

అందరికీ అమ్మే పెద్ద దిక్కు.

సాధారణంగా అమ్మ తమ దగ్గర ఉండేటప్పుడు తనూ విశాలి ఎక్కువ అసైన్‌మెంట్స్, కొత్త ప్రాజెక్టులు తీసుకుంటారు. అమ్మ పిల్లలను ఇంటిని చూసుకుంటుంది. అమ్మ చెల్లి దగ్గరకు వెళ్ళిన ఆరు నెలలూ ఇద్దరిలో ఎవరో ఒకరం బాధ్యత తీసుకోవాలి. అక్కడ చెల్లీ, ఆమె భర్తా అంతే!

ఎవరో చేసిన ఒడంబడికలా నిశ్శబ్దంగా ప్రణాళికాబద్ధంగా రోజులు గడుస్తున్నాయి... దానాదీనా, అమ్మ ఎప్పుడూ ఆన్ డిమాండ్!

"అత్తయ్య మనల్ని నలుగుర్నీ, పిల్లలు నలుగుర్నీ పెంచుతున్నారు," విశాలి అంటుంది అప్పుడప్పుడు. "పిల్లల చదువులు, మన ఉద్యోగాలు అత్తయ్య పై ఆధార పడి ఉన్నాయి. మనం మర్చిపోకూడదు!"

అలాగని అంతా సవ్యంగా ఉందని చెప్పలేను.

"ఎంతయినా అత్తయ్యకు కూతురిపై ఆమె పిల్లలపై మమకారం ఎక్కువ" అని విశాలి లోలోన అన్నా –

"ఎంత కాదనుకున్నా అమ్మకు చిన్నప్పటి నుంచీ నేనంటే చులకనే. అన్నయ్య పక్షమే. ఎన్ని చెప్పినా అన్నయ్య పిల్లలేగా ఆమెకు అసలు వారసులు!" చెల్లెలు బిగ్గరగానే అంటుంది. అనుకున్న సమయానికి అమ్మ రాకపోకలు కాస్త అటూ ఇటూ అయితే చాలు.

ఊ...!

ఎప్పుడు ఎవరు ఎలా ఆలోచిస్తుంటారో ఏం చేస్తుంటారో ఎవరం చెప్పగలం?

సరే, ఇప్పుడు అమ్మకి మామయ్య చెప్పిన విషయం చెబితేఎలా స్పందిస్తుందో! తనకే ఇంత ఉద్వేగంగా ఉంటే – ఇక అమ్మ ఉరకలు వేయదూ?

వీలుంటే పిల్లలనూ తీసుకెళితే బావుండేది.

వీలుపడదు. విశాలి చెప్పింది కదా. వాళ్ళవి తమకన్నా బిజీ షెడ్యూల్స్.

తమకైనా సెలవు పెట్టడానికి సాకు దొరుకుతుందేమో కానీ, వారికి దొరకదు!

విశాలి అన్నీ చూసుకుంటుందన్న ధీమా. ఇక సర్దేశా నా సరంజామా. అన్ని పనులూ ఆమెకే అప్పజెప్పి - మూడురోజుల సెలవుతో ఊరికి బయలుదేరాం నేనూ అమ్మ.

అదే చిత్రం.

అమ్మ ఏమీ అనలేదు.

మాట్లాడలేదు. ఓ ఉలుకూ పలుకూ లేదు.

అలాగే బయలుదేరాం ఊరికి.

ప్రయాణంలోనూ అమ్మ అంతే. కళ్ళు మూసుకొని కిటికీకి తలవాల్చి పడుకుంది.

నేను వ్యాక్ మాన్ హెడ్ ఫోన్స్ తలకు తగిలించి - కారు ముందుకు ఉరికించాను.

*

పొలం గట్టు మీద నిలబడ్డాం. మామయ్యా, నేను.

కళకళ లాడుతూ ఆముదాల పంట. గెలలు మూరెడు పొడవున్నాయి. చెట్లు మనిషిని మించి పెరిగిపోయాయి.

మామయ్య మాతో మాట్లాడుతూనే పొలంలోకి నడచి వెళ్ళాడు. వెనకే నేనూ వెళ్ళా. నడుస్తూ నడుస్తూ - మామయ్య విరగ కాసిన ఓ చెట్టును కాలితోనే మొదలంటా విరిచేడు.

“మామయ్యా - అంత చక్కటి చెట్టును అలా విరిచేశావే-?” అసంకల్పితంగా వంగి చెట్టును మళ్ళీ నిలబెట్టే ప్రయత్నం చేస్తూ.

“బెరుకు చెట్టు!” మామయ్య అభావంగా అన్నాడు, “ఏడేళ్ళుగా కరువు, ఈ ఏడు ఎడతెరపి లేని వాన.”

పచ్చగా కళకళలాడుతోన్న పొలాలు. నిండుగా తళతళలాడుతోన్న చెరువులు దొరువులు ఎంతో ఆహ్లాదకరంగా ఉంటే మామయ్య అలా నిరాశగా అంటాడేం?

అదే అడిగాను.

“ఆ పచ్చదనం పంట ఎదుగుదల చూసి మురిసి పోవద్దురా-పైరు తండు బోయింది.[1] ఈ ఏడాది పంట పోయింది. ప్రతి ఏటి కన్నా దారుణంగా!”

“ఓ...! మరి పొలం కొనేవాళ్ళు ఏం చేస్తారు?”

“కాలువలు వస్తున్నాయి. మన పొలాల పక్కనే పెద్ద కాలువ పడుతుంది. ఇక నీటికి కొదువ ఉండబోదు.”

“అలాంటప్పుడు పొలాల్ని వదులుకోవడం ఎందుకు మామయ్యా-?”

“సేద్యం ఆషామాషీ వ్యవహారం కాదురా చిన్నూ - కంటి పాపలా పెంచాలి పంటను.” మామయ్య కంఠంలో ఒక విధమైన నిర్లిప్తత.

“మరి.. మరి.. నువ్వు ఏం చేస్తావ్.. మామయ్యా ...”

ఎందుకో ఈ ప్రశ్న నా గొంతులోంచి సులువుగా బయట పడలేదు. అడగలేక అడిగాను.

మామయ్య అంతే. మాట మాట్లాడకుండా గుంభనంగా నవ్వాడు.

---

1. Over Vegetation

చెరువు గట్టు మీదుగా ఇంటికి వచ్చాం. చెరువు నిండా జమ్మి , తూటుపూలు వాడుకకు పనికొచ్చేలా లేవు నీళ్ళు. ఏదో దుర్గంధం, కంపు. పొలాల ఎరువుల మిగులు తగులు చెరువుపై తెట్టులా తేలుతోంది.

"కొత్త నీరు పెట్టినా - అంతే - " మామయ్య నా మనసులో మాట తెలిసినట్లు అన్నాడు.

"అందుకే, కాస్త దూరంగా మరో చెరువు తవ్వించాలి. కాలువలు వచ్చే లోపు" మళ్ళీ మామయ్య గొంతులో ఓ ఉత్సాహం.

ఇంటి ముందుకు వచ్చేసరికి వాకిట్లోనే కనబడింది. అమ్మ అరుగు మీద.

"నువ్వూ మాతో పాటు వస్తే పోయేదమ్మా-" నేను చనువుగా వెళ్ళి అమ్మ పక్కన కూర్చున్నా.

"అందరినీ పలకరించావా అక్కయ్యా -" మామయ్య మంచం వాలుస్తూ అన్నాడు.

"ఎవరున్నారా తమ్ముడూ - వెనుక వీథి రత్నమ్మ అమెరికా పోయింది. కూతురు పురుడు పోయను. పక్క వీథిలో పురుషోత్తంగారి అక్క పట్నం పోయింది. మనువళ్ళకు పరీక్షలట, చదివించడానికి. మరొకరు ఆసుపత్రికి. ఇంకొకరు కూతురిని కాపురానికి పంపను బోయారు. అసలు ఊరే కళ తప్పింది. పై నుంచి ఏదో వత్తిడి కనిపిస్తోంది. మునుపట్లా లేదు-" అమ్మ మౌనంగా ఉంది కాసేపు.

మామయ్య మాట్లాడడం మొదలు పెట్టాడు. "అక్కయ్యా నువ్వు శేషమ్మ మనవణ్ణి సుందరం బాబాయినీ పలకరించిరాలా? వాగొడ్డు లక్ష్మమ్మ మనవణ్ణీ...? ఒకప్పుడు పట్నం పోవాలంటూ పోయారా...! ఇప్పుడు మళ్ళీ పొలాలు మగతాకు తీసుకొని మరీ సేద్యం చేస్తున్నాడు-"

"అదేంట్రా ఎవరు బట్టినా పట్నం పోతుంటే –"

"మన ఊరి వాళ్ళంతా ఉలిపి కట్టెల్లే అక్కయ్యా..." మామయ్య నవ్వాడు, వాళ్ళ పిల్లల చదువులు అయిపోయాయి. ఉద్యోగాలు కుదిరాయి. పెళ్ళిళ్ళు పురుళ్ళు అయ్యాయి. అయినా అప్పట్లో పట్నం కాపురాలు చేయగలిగారంటే – ఇక్కడ పంటలు పండేవి. ఇప్పుడు పంటలు లేవు, పండితేనేగా? పట్నం కాపురాలు చేసేట్టు లేవు. మళ్ళీ వెనక్కి వచ్చేశారు – అంతే గాదు ఇప్పుడు పట్టణమే పల్లెలోకి వలస వచ్చింది. ఫ్రిజ్‌లు, టివిలు, సోఫాలు – ఏం లేవు చెప్పు?"

"అన్నీ బాగానే ఉన్నాయి కానీరా తమ్ముడూ – ఆ సాంబడితో ఏదో పేచీ పడ్డావట–" అమ్మ కళ్ళు చికిలించింది. ఎలాంటి ఉపోద్ఘాతం లేకుండానే – మొదటిసారిగా వ్యవహర్తలా మాట్లాడింది.

"అదంతే! అయిపోయిందిలే–"

"అందుకేనా పొలం అమ్మకానికి పెట్టింది?" అమ్మ ఆరా తీసింది. అంతకు ముందు అంత తీవ్రంగా అనలేదు.

"మాటా మాటా పెరిగింది. నువ్వెంతంటే నువ్వెంతని – " మామయ్య గుమ్మడికాయ దొంగలా అన్నాడు. "ఏముందీ చెప్పడానికి?"

"ఏమీ ఎందుకుండదురా? నాకు ఈ పుట్టింటితో మిగిలిన ఏకైక బంధం ఆ మడి చెక్క. దాని కోసం ఇంత రాద్ధాంతమా?" అమ్మ గొంతులో దిగులు.

"అవునక్కా... అడిగాడు. శాయన్న ఆ పొలం కావాలన్నాడు. దానికేంలే – ఇవ్వచ్చు. కాలువలు వస్తున్నాయి. రేటు పెరిగింది. ఎవరికో ఎందుకు తనే తీసుకుంటాను అన్నాడు సాంబడు. ఈ పొలం కనుక శాయన్నక తీసుకుంటే బండి బాటకు వాళ్ళను బతిమిలాడాలి. వాళ్ళని అడిగేదేంటి – పొలమే నాకిమ్మంటాడు సాంబడు. ఇదీ విషయం."

అమ్మలో మునుపెరుగని నివ్వెరపాటు. మామయ్య ముఖంలోకే చూస్తూ ఉంది.

"మొన్నామధ్య కాలువ గట్టు దగ్గర తగాదా - అటు మొన్న మురుగు కాలువ తీయబోతే తగాదా - ఒకటా రెండా? ఆముదాల చేలో అడ్డంగా బండిని నడిపేశారు. రోజూ గొర్రెలు కొట్టుకుపోతున్నారు. మొక్కల తొక్కిడి, ఆగడం, అడిగేవారే లేకుండా పోయారు! అంతెందుకు నిన్నటికి నిన్న నిలువెత్తు చెట్టును రాత్రికి రాత్రి నరికించేశారు - అదేంట్రా అంటే - మొదలు మన చేలో ఉన్నా మాను వాళ్ళ పక్కకి పెరిగిందట! అబ్బబ్బ!" మామయ్య ఉస్సూరన్నాడు!

కనిపించకుండా తడిగుడ్డతో గొంతులు కోసే కనికట్టు కార్పోరేట్ మనుషులం మేము. మామయ్య చెబుతున్నవి చాలా చిత్రంగా అనిపించాయి. "సూది మొన మోపినంత నేల కోసం..." యుద్ధాలు చేసుకున్నారంటే - ఇలాంటి పౌరుషాలతోనేమో-

"అయినా, ఈ తగాదాలన్నీ మనకు సాంబడికి మధ్య కదా? ఈ శాయన్నను ఎందుకు లాగార్రా?" అమ్మ స్పష్టంగానే అడిగింది.

"మన తరుపున నిలబడింది శాయన్నేగా..." మామయ్య మాట మింగేశాడు, "తగువు మొదలయ్యింది, తాతలదాకా పోయింది. నువ్వెంతంటే నువ్వెంతని. మీ తాత బర్రెలు కాసాడంటే, మీ తాత గొర్రెలు మేపాడనీ - ఒక అంతూదరీ లేదు. ఇది నా పుట్టినూరు అంటే, నా పురిటిగడ్డ. తలలు పగిలాయి. పోలీసులు కేసులు కాకుండా ఎట్లాగో ఆపి ఉంచాం-" మామయ్య పూర్తి చేశాడు.

"ఇంత జరిగినా... నాతో మాట మాత్రం అనలేదురా?" అమ్మ గొంతులో అపనమ్మకం.

నిజమే మరి, అది అమ్మ పొలం.

"జరిగిందేదో జరిగి పోయింది - వదిలేయ్ అక్కా, బయానా తీసుకొన్నా, రిజిస్టర్ చేయాలి."

"మన కాళ్ళు మట్టిలో ఉండొచ్చు కానీ, భావాలు బురదలో ఉండకూడదురా. . మొదట శాయన్నకు మాటిచ్చావు. వాళ్ళు డబ్బు కూడబెట్టుకొనే లోగా - మరొకరికి ఇచ్చావ్. ఇదెక్కడి వ్యవహారంరా?" అమ్మ గొంతు ఖంగుమంది.

"ఇది మాట మీద నిలబడే రోజులు కావులే అమ్మా, నోటు మీద నిలబడే రోజులు. అయినా, మనకెందుకమ్మా ఆ పొలం పుట్ర ఆ తగవులు? తలనొప్పులు? నేనేమయినా తిరిగి వస్తానా? చింటూ, మింటూ వస్తారా? ఆ వచ్చే నాలుగు డబ్బుల్తో సిటీలో ఏదైనా కొంటే... అది పెరిగే విలువే కానీ తరిగేది కాదు. ఎవరికి అమ్మితే మన కెందుకు? మామయ్య అన్నీ చూసి పెట్టాడు. నువ్వు సంతకం పెట్టేయి." నేను నా అభిప్రాయం స్పష్టంగా చెప్పేశాను.

"ఏమని పెట్టాలి?" అమ్మ తీవ్రంగా స్పందించింది.

"ఏమీ అనకుండానే పెట్టు" నేను వాతావరణం తేలిక పరుద్దామని నవ్వుతూ అన్నాను.

"అది మా అమ్మ చేనురా. మా అమ్మమ్మ తన పసుపు కుంకుమల చేనును అమ్మి అమ్మకు కొనిచ్చిన చేనురా. తరతరాల జ్ఞాపకాలున్నాయి. అక్కడ పండిన పంటతో చేసిన పరమాన్నంతోనే నాకు అన్నప్రాసన చేశారు. ఆ మడిచెక్కతోనే నేను అత్తవారింట అడుగుపెట్టా. మా అమ్మ అక్కడ నాటిన మామిడి చెట్టు మొదట్లోనే విశ్రమించి ఉంది. శుభమైనా అశుభమైనా - కరువైనా ఉరువైనా ఏడాది కొక్కమారు "అక్కా నేనున్నానని నా తమ్ముడు పలకరించింది ఆ పంటతోనే రా-" అమ్మ ఉద్వేగంగా అంది.

"అమ్మా - అవన్నీ ఎవరు కాదన్నారు? ఇది ఎమోషన్స్‌తోనో, నోస్టాల్జియాతోనో తీసుకోవలసిన నిర్ణయం కాదు. మనకు ఈ ఊరితో ఏమిటి సంబంధం? మనపాటికి మనం పోతాం. మామయ్య కొన్నాళ్ళకి వాళ్ళ పిల్లల దగ్గరకి వెళతాడేమో. మిగిలేది ఆ సాంబయ్య మామయ్య, ఈ శాయన్న కొడుకులేగా? వాళ్ళను ఎలా డీల్ చేయాలో మనకేం తెలుసు? అమ్మా - అన్నీ మామయ్యకు వదిలేయ్! తనే చూసుకొంటాడు." చాలా సౌమ్యంగా చెప్పేశాను నేను చెప్పదలుచుకొన్నదానిని.

"ఎవరికి అమ్మాలో నేను ఆలోచించుకొంటాను-" అమ్మ భీష్మించింది.

" ఏంటక్కా... వయసు వస్తోన్న కొద్దీ మొండితనం పెరుగుతుందే... ఇదే బావయ్య ఉంటే ఇంతవరకూ రానిచ్చేవాడా?" మామయ్య అసహనంగా అన్నాడు.

"అందుకేగా నేను ఆలోచించడం మొదలు పెట్టాను. మంచేమిటో చెడేమిటో-"

"మంచీ చెడుల తర్క వితర్కాలు ఇప్పుడెందుక్కానీ - అమ్మా, నాన్న ఉంటే ఏం చేసేవాడో ఉన్నన్నాళ్ళు ఏం చేశాడో అదే చేద్దాం. మామయ్యా... నీ ఇష్ట ప్రకారం కానీ!" నేను భరోసా ఇచ్చేశాను. "అమ్మ అలాగే అంటుందిలే-" తేలికగా తీసిపారేశాను.

అమ్మ దవడ బిగుసుకుంది. గిర్రున తిరిగి గదిలోకి వెళ్ళింది.

*

అమ్మకన్నా కోపంగా మామయ్య బయటకెళ్ళిపోయాడు.

అటూ ఇటూ తేల్చుకోలేక నేను!

మా తాతయ్య మొత్తానికి మంచి చిక్కునే తెచ్చి పెట్టాడు. ఆ ఇచ్చే చేను నాన్న పేరున రాసేస్తే పోయేదిగా. ఎప్పుడో వదిలించి పారేసేవాడు! అయినా, అమ్మేమిటి అంత మొండి పట్టు? ఆమెకు ఉన్న ఏకైక సన్నిహిత బంధం మామయ్యే. లేనిపోని మంకు పట్టి ఆ ఒక్కడినీ దూరం చేసుకోదుగా?

ఎవరికి అమ్మితే ఏం పోయింది? అనవసరంగా గొడవ తెచ్చి నెత్తిన పెడుతోంది!

మామయ్య పిల్లలతోనూ సంబంధాలు తెగిపోవూ? అటు చెల్లికి ఇటు తనకూ వారెంత అండగా ఉంటున్నారో – అంతా ఈ సిల్లీ విషయంతో కొట్టుకు పోయేట్టుగా ఉంది!

ఏదో కొంత డబ్బు వస్తుంది. కొత్త ఫ్లాట్ ఇన్‌స్టాల్‌మెంట్‌కి ఉపయోగపడుతుంది – అనుకున్నా – కానీ, ఇక్కడంతా తలకిందుల వ్యవహారంలా తయారయింది. కోరి తెచ్చుకుంటోన్న తలనొప్పి. ఫ్చ్!

“మా అమ్మా ఇంతే!” మామయ్య ఎప్పుడు తిరిగి వచ్చాడో కానీ, నా పక్కన చతికిలబడుతూ అన్నాడు, “అసలా పొలం అక్క పేరున పెట్టేదాకా ఎంత పట్టు పట్టిందని! ‘ఒక చెక్కలా ఘనంగా ఉంటుంది. అబ్బాయి పేరున పెడదాం’ అని నాన్న అంటే ఆమె వింటేనా! అక్క అన్నట్లే జరిగితే, నేను మళ్ళీ ఊళ్ళో తలెత్తుకు తిరగ్గలనా? ఈ ఆడాళ్ళకి ఏం తెలుసు పరువు మర్యాద? ఆ రెండూ మంటగలిశాక నేనిక ఈ ఊళ్ళో ఉన్నట్టే!” ఎంత అణచుకుందామని అనుకున్నా మామయ్య ప్రతి మాటలో అసహనం.

“మామయ్యా... అదేం జరగదులే! ఓ పూట గడవనీ... అమ్మ తనే సర్దుకుంటుంది. మనం ఎక్కువా ఆమె మాట ఎక్కువా – తేల్చుకోనీ! ” అమ్మకు వినిపించేలా కాస్త బిగ్గరగా అన్నాను.

ఆశ్చర్యం. అమ్మ అప్పుడే ఇంటి గేటు తీసుకొని లోపలికి వస్తోంది. అమ్మ ఎప్పుడు వెళ్ళింది? ఎక్కడికి వెళ్ళింది?

మామయ్యా నేనూ ముఖముఖాలు చూసుకొన్నాం.

అమ్మ ఎలాంటి ఉపోద్ఘాతాలు లేకుండా మామయ్యతో సూటిగా అంది.

"పొలం రిజిస్ట్రేషన్ ఎల్లుండి. నువ్వు మొదట బయానా[1] తీసుకున్న రేటుకే. వారికే!"

"ఎవరికీ ఆ శాయన్న కొడుక్కా?!? తాత ముత్తాతల పొలం వాళ్ళ చేతుల్లోకా?"

మామయ్య అసహనం హద్దులు మీరుతోంది. నన్నూ ముంచెత్తబోతోంది.

"కొంపదీసి వాళ్ళకు చెప్పి వచ్చావా - అమ్మా" అనుమానంగా అడిగాను.

"అవును."

"అది మన తరతరాల వారసత్వం. దిక్కూ దివాణం లేని వాడి చేతిలో పెడతామా? మన చేలో వాళ్ళ కాడి నడుస్తుందా!" మామయ్య చివాలున లేచి నిల్చున్నాడు.

"ట్రాక్టర్ నడుస్తుంది!" అమ్మ నింపాదిగా అంది.

"ఇది నా జన్మభూమి, పురిటిగడ్డ, నేను పరాయి పాల్జేయనివ్వను. వాళ్ళెవరికో ఎందుకు? నాకే రిజిస్టర్ చేయి! తరువాతి సంగతి తరువాత!" మామయ్య స్థిర నిశ్చయంతో అన్నాడు.

"వాళ్ళకి మొదట మాట ఇచ్చింది నువ్వే!" అమ్మ నిమ్మళంగా అంది.

"తొందర పడ్డాను. తెలుసుకొన్నాను. ఎవరికీ వద్దు. నాకే రాసేయి!" మామయ్య ఉద్వేగంగా అన్నాడు. "అమ్మ చెట్టు ఉందక్కడ! అది నా పేగుముడి!"

1. advance

"నీ జన్మభూమి... నీ పురిటిగడ్డ... నీ పేగుముడి! బావుందిరా తమ్ముడూ...! మరి నా అమ్మకు? అమ్మమ్మకు?" అమ్మ తీవ్రంగా అంది, "పుట్టినప్పటి నుంచీ మావి కావు – అనుకుంటూనే పెరిగాం. ఈ చెట్టును, పుట్టను, గుట్టను, కాలవగట్టును, పిచ్చుక గూళ్ళనూ ప్రేమించడానికి పెంపకం అడ్డురాలేదురా. ఆ ఆపేక్షలు ఆ ఆప్యాయతలే మేం కూడ బెట్టిన ఆస్తులురా. అంపకాలు పెట్టి సాగనంపిన చోటికి వెళ్ళాం. ఎక్కడికక్కడ ఆప్యాయత అనురాగాల కొరకు పరితపించడం తప్ప – అధికారాలు పెంచుకోలేకపోయాం. బావుందిరా! జననీ జన్మభూమి – అంటూ మీరు తలలు పగలు కొట్టుకుంటున్నారే – అసలు ఆ జననీ జన్మభూమి ఏదిరా? ఇది కాదు కదరా?" అమ్మ మాటలు ఓ వెల్లువలా ముంచెత్తుతున్నాయి.

నేను, మామయ్యా నిశ్చేష్టులమై నిలబడిపోయాం.

"ఎక్కడో పుట్టి ఇక్కడ మట్టిలో కలిసిన అమ్మ పుట్టిల్లు, పేగుముడి, జన్మభూమి మనం ఏనాడైనా గుర్తుకు చేసుకున్నామా? అసలీ, జన్మభూమి అన్నదాంట్లోని డొల్లతనం తెలుస్తుందా? ఆ భూమి ఎవరు జన్మించినది? అక్కడి మగవారు! చూశావా...ఈ ఆలోచనలో ఎంతటి సంకుచితత్వం ఉన్నదో! అంతదాకా ఎందుకూ యాభై ఏళ్ళు నీతో కాపురం చేసిన నీ భార్య...? ఈ భూమిపై మమకారం పెంచుకోలేదా? ఆమె జన్మభూమి ఇది కాదే! అంతమాత్రాన ఆమె ఈ భూమికి పరాయిదవుతుందా?" అమ్మ గొంతు రుద్దమయింది. "మీకు తెలియదురా ఆపేక్ష అంటే... ఆర్ద్రత అంటే..."

మేము ఏమీ మాట్లాడలేని మాటలు లేని నిస్సహాయులమయ్యాం.

నిశ్శబ్దంగా ఒకరి వంక ఒకరం చూసి – అమ్మ వైపు చూశాం.

"మాకేమీ కావని తెలిసి మేమెలా ప్రేమించగలమో మీరు అర్థం చేసుకోలేరు. అది మీ తప్పు కాదు. పుట్టినప్పటి నుంచీ గిట్టేదాకా ఉన్న ఊరిపై పట్టు బిగించి గిరి గీసుకొని కూర్చున్నారు. ఆ గిరిని వదిలి బతకలేమోనన్న భయంతో ముడుచుకుపోతున్నారు. కాలం మారిందేమో కానీ, కథ అంతే!"

అమ్మ కాస్తాగి మళ్ళీ అంది, "ఎక్కడైనా బతకగల ధైర్యం - ఎచ్చోటనైనా మమకారాన్ని పెంచుకోగల గుండె - మాకున్నాయిరా!" అమ్మ మాట్లాడడం లేదు. ఆమె భావ ప్రవాహంలో ముంచెత్తుతోంది. నేనూ మామయ్యా నోట మాట రాని వాళ్ళమై నిలబడిపోయాం.

"నా పొలాన్ని ఎవరు ఆపేక్షగా బిడ్డలా చూడగలరో వాళ్ళకి ఇస్తాను. నీ మాట పోనివ్వడం దేనికని సాంబడినే ముందు అడిగాను. బండి దారి గురించే మాట్లాడాడు ఎంతసేపూ, "మన మధ్యలో ఆ గాసగాడి కొడుక్కి పొలమేంటి" అంటూ బీరాలు పోయాడు. ఎంత అహం ఎంత భేషజం సాంబడి ప్రతి మాటలో!

శాయన్న బుద్దెరిగినప్పటి నుంచి ఆ పొలం ఆసుపాసులు ఎరిగిన వాడు, బిడ్డలా సాకగలడు. అమ్మను ఆప్యాయంగా పలకరించగలడు. నాకు ఆ నమ్మకం ఉంది. అతడూ మా లాంటివాడే. ఏ ఆపేక్షతో ఆ చెట్టు కోసం గట్టు కోసం నీ తరుపున తన తల పగల గొట్టించుకొన్నాడో - ఆ ఆపేక్షతోనే ఆ చేనుని చూసుకుంటాడు! ఇక, అతని కొడుకును నాలుగు అక్షరాలు నేర్పే బడి మొదలు పెట్టమన్నాను. చదువు అబ్బితే చాలు, అన్నీ అవే అమరుతాయి. వాళ్ళిచ్చే డబ్బు వాళ్ళకే ఉపయోగపడుతుంది. ఇకపై పొలం వాళ్ళది. ఇకనైనా వాళ్ళను బ్రతకనీయండిరా-"

అమ్మ వెళ్ళి కారులో కూర్చుంది.

మరో మాట మాట్లాడ కుండా.

నేనూ మామయ్యా నిలువపాతరేసినట్లు నిలబడిపోయాం.

మరో మాట మాట్లాడ లేక.

రచన
ప్రారంభం : 5 మార్చి 2006
ముగింపు : 22 మార్చి 2006